# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 134 | పేజీలు: 4 | వెల: రూ.4/- | ఆదివారం 11 జనవరి 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## హార్వర్డ్ వర్సిటీ కాన్ఫరెన్స్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే 23వ ఎడిషన్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం లభించింది. హైదరాబాద్, తెలంగాణపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిని పెంపొందించడంలో కేటీఆర్ కీలక కృషికి గానూ ఈ ఆహ్వానం అందినట్లుగా నిర్వాహకులు తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో ఈ కాన్ఫరెన్స్ జరగనుంది. ది ఇండియా వి ఇమాజిన్ అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత్, దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, వ్యాపారవేత్తలు, పాలసీ మేకర్స్, సాంస్కృతిక రంగ నిపుణులు హాజరుకానున్నారు.



### తెలుగు రాష్ట్రాల్లో

## సంక్రాంతి రద్దీ

### ప్రత్యేక రైళ్లు. బస్సుల సర్వీసులు

### ఎక్కడికక్కడ రహదారుల జామ్

### టోల్ గేట్ల వద్ద వాహనాలు భారీ క్యూ

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

తెలుగు వారికి పెద్ద పండగ సంక్రాంతి. ఎంత దూరంలో ఉన్నాసరే సంక్రాంతికి ఊరు వెళ్లాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉంటుంది. అందుకే సొంతూళ్లకు బయల్దేరే వారితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రోడ్లు జామ్ అయ్యాయి. బతుకుదెరువు కోసం వచ్చి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఏదో వాహనం పట్టుకొని ఊరికి వెళ్దామని బయల్దేరడంతో ఆర్టీసీ బస్‌లు, ట్రైన్స్, ప్రైవేటు వాహనాలు అన్నీ కూడా కిటకిటలాడుతున్నాయి. ఇలా పట్టణాల నుంచి పల్లెలకు వెళ్తున్న జనంతో రోడ్లు కిక్కిరిసి పోగా, రైల్వేస్టేషన్లు, బస్టాండ్, విమానాశ్రయాలు కూడా రద్దీగా మారాయి. ఏటా కనిపించిన దృశ్యాలే సీన్లే రిపీట్ అయ్యాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో వాహనాలు బారులు తీరాయి. సంక్రాంతికి వెళ్లే వాహనాలతో టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్లు కొద్ది వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నా రద్దీని నియంత్రించడం ..మిగతా 2లో

## నేనూ డాక్టర్‌నే!

# కానీ సోషల్ డాక్టర్‌ను

### సీఎం రేవంత్ రెడ్డి

### హెచ్ఐసీసీలో ఫెలోస్ ఇండియా సదస్సు

### ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్, ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదస్సు

### ఫెలోస్ ఇండియా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

ప్రజారోగ్య సంరక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పని చేసేందుకు సిద్ధమని సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలమని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది : తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని సీఎం వ్యాఖ్యానించారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, అయితే ప్రజల నాడిని పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం పేర్కొన్నారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం, వైద్యులు కలిసి పని చేద్దామని సీఎం అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ..మిగతా 2లో

# ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలు



### నాలుగింటిలో బెర్త్ కోసం కూటమిలో పోటీ

### టీడీపీలో భారీగా ఆశావహులు.. బీజేపీ, జనసేన నుంచి కూడా రేసు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

మూడు పార్టీలు. నాలుగు సీట్లు. ఎవరికెన్ని. ఇదే ఇప్పుడు కూటమి పార్టీల్లో చర్చ. ఎందరో ఆశావహులౌమరెందరో లాబీయింగ్‌లు. ఎవరి లెక్కలు వాళ్లవి. ఒక్కొక్కరి ఎక్స్‌పెక్టేషన్స్ ఒక్కోలా ఉన్నాయ్. పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్న వాళ్లు.. ఆరాటపడుతున్న వాళ్లు చాలామందే ఉన్నారు. ఇప్పటి నుంచే నెక్స్ట్ లెవల్ లాబీయింగ్ చేస్తున్నారట లీడర్లు. రాజ్యసభ సీట్లపై బీజేపీ ప్లానింగ్ ఒకలా ఉంటే..జనసేన, టీడీపీ అంచనాలు ఇంకోలా ఉన్నాయట. ఆ మూడు పార్టీల్లో..నాలుగు సీట్లు ఎవరికి? పెద్దల సభకు వెళ్లేదెవరు? అన్నది ఆసక్తికరంగా మారింది. కూటమిలో రాజ్యసభ సీటు రేసు చర్చకు దారితీస్తోంది. మరో నాలుగు నెలల్లో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఆ నాలుగు సీట్ల కోసం అటు టీడీపీ, ఇటు జనసేన, మరోవైపు బీజేపీలో ఎవరి ఎక్స్‌పెక్టేషన్స్ ..మిగతా 2లో



## తెలంగాణ బరిలో జనసేన

### మున్సిపల్ ఎన్నికల్లో పోటీ

### కార్యాచరణను ప్రకటించిన పార్టీ

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన పార్టీ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణను ప్రారంభించింది. సాధ్యమైనన్ని స్థానాల్లో పోటీచేయాలని జనసేన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పూనాది వేస్తామంటూ జఅబశ్రీశ్రీనసేన ఓ ప్రకటనలో ఈ వివరాలు తెలిపింది. తెలంగాణలో ..మిగతా 2లో



## కుప్పకూలిన చాపర్

### సాంకేతిక లోపంతో ల్యాండింగ్

### ఆరుగురికి తీవ్ర గాయాలు.. తృటిలో తప్పిన ప్రమాదం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

ఒడిశాలోని రూర్కెలాలో పెను ప్రమాదం తప్పింది. ఎయిర్‌స్ట్రిప్ నుండి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో చాపర్ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు సాంకేతిక లోపం గుర్తించిన తర్వాత ల్యాండింగ్ జరిగింది. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ పైలట్‌ను ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. అందరినీ సకాలంలో సురక్షితంగా తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సంఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. భువనేశ్వర్ నుండి రూర్కెలాకు బయలుదేరిన తొమ్మిది సీట్ల చాపర్ విమానం టేకాఫ్ అయిన తర్వాత, ..మిగతా 2లో

### తెలంగాణలోని ప్రాజెక్టులకు

# ఆర్థిక సాయం చేయండి

### మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూత ఇవ్వండి

### తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

### ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి




హైదరాబాద్, జనవరి 10 (నమస్తే ఉదయం)

తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయన తెరాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక దేశం కేంద్ర–రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం ..మిగతా 2లో



## మాజీ ఐపీఎస్ భార్యకు కుచ్చుటోపీ

2

### రూ.2.58 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

### వాట్సప్ చిట్కాల పేరుతో ఘరానా మోసం

# నేనూ డాక్టర్‌నే! కానీ సోషల్ డాక్టర్‌ను

**మొదటి పేజీ తరువాయి...**



తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ ఉండాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

"నేను వైద్యుడిని కాదు కానీ నేనూ డాక్టర్‌నే సోషల్ డాక్టర్‌ను. లైఫ్ సైన్సెస్, ఫార్మా ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోంది. హెల్త్ కేర్ ఆవిష్కరణ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోంది. మనుషులు, సమాజంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ప్రభుత్వ పాలసీలు మెరుగు కోసం వైద్యులతో కలిసి పనిచేయడానికి మేం సిద్ధం. వైద్యులు అధునాతన సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాలి. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో మనం భాగస్వాములం అవుదాం. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు మనం కలిసి పని చేద్దాం. విద్యార్థులకు సీపీఆర్ నేర్పేందుకు ముందుకు వస్తే చాలా మంది ప్రాణాలను కాపాడగలం. క్వాలిటీ ఆఫ్ హెల్త్‌కేర్ కోసం అందరూ కృషి చేయాలి. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమం కావాలి."– రేవంత్ రెడ్డి, సీఎం

## కుప్పకూలిన చాపర్

**మొదటి పేజీ తరువాయి...**

దాదాపు 10 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. విమానం మధ్యాహ్నం 1:15 గంటలకు రూర్కెలాలో ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపం కారణంగా జల్దా సమీపంలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానంలో నలుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. వీరిలో కెప్టెన్ నవీన్ కడంగ, కెప్టెన్ తరుణ్ శ్రీవాస్తవ ఉన్నారు. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడ్డారని అధికారులు నిర్ధారించారు. వారందరినీ సురక్షితంగా తరలించి చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాదం తర్వాత మూడు అగ్నిమాపక దళ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానిక నివాసితులు, పోలీసులు సహాయక చర్యల్లో సహాయపడ్డారు. దీంతో విమానంలోని ప్రయాణికులను సకాలంలో రక్షించి ఆసుపత్రికి తరలించారు. జల్దా సమీపంలో విమానం దిగే ముందు అత్యవసరంగా ల్యాండ్ చేయడానికి ప్రయత్నించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇదే స్థానిక ప్రజలను భయపెట్టింది. విమానం చాలా కిందకు దిగింది. ఆ తర్వాత విమానం ముందుకు దూసుకువెళ్లి కూలిపోయింది. విమాన ప్రమాదం తర్వాత, అధికారులు ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రాంతీయ మార్గాల్లో విమానయాన భద్రత గురించి ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, సమీపంలో చెట్లు ఉన్నాయని, విమానం వాటిలో చిక్కుకుని ఉంటే, అది పెద్ద ప్రమాదానికి కారణమై ఉండేదని భావిస్తున్నారు.

## బంగ్లాలో ఆగని దాడులు

### దుండగుల దాడిలో మరో హిందువు హత్య



**ఢాకా,జనవరి జనవరి 10 (నమస్తే ఉదయం)**

కొంత కాలంగా బంగ్లాదేశ్ లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల్లో భాగంగా మరో హిందువు కన్నుమూశాడు. సునమ్‌గంజ్ జిల్లాలో ఓ అల్లరి మూక చేతుల్లో జై మహాపాత్రో అనే హిందువు ప్రాణాలు కోల్పోయాడు. ఈ హత్యోదంతం తీవ్ర కలకలం రేపుతోంది. మీడియా కథనాల ప్రకారం.. సునమ్‌గంజ్ జిల్లాలో జరిగిన భంగాడోహోర్ గ్రామంలో ఆర్థిక లావాదేవీల అంశాన్ని ఆధారంగా చేసుకొని గురువారం 19 ఏళ్ల జై మహాపాత్రపై అమీరుల్ ఇస్లాం అనే వ్యక్తితోపాటు మరికొంత మంది దాడి చేశారు. ఈ దాడిలో మహాపాత్రో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. హత్య వార్త తెలియగానే స్థానిక హిందూ సమాజం, మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ఢాకాలోని పలు ప్రాంతాల్లో శనివారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'జై మహాపాత్రోకు న్యాయం ' కావాలంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్య అనంతరం దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. 35 రోజుల్లో 11 మంది హిందువుల చనిపోయినట్లు సమాచారం.



### తెలుగు రాష్ట్రాల్లో

## సంక్రాంతి రద్దీ

అధికారుల వల్ల కాలేదు. టోల్ ప్లాజాల వద్దే కాకుండా హైదరాబాద్ శివారు ప్రాంతాలు, బెంగళూరు శివార్లలో ట్రాఫిక్ జామ్ జనాలకు చుక్కలు చూపిస్తోంది. ప్రస్తుతం ఈ ట్రాఫిక్ క్లియర్ అవ్వడానికి గంటల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి రద్దీని తట్టుకునేందుకు రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రెగ్యులర్‌గా నడిచే రైళ్లకు అదనంగా ట్రైన్స్ కలిపి మొత్తంగా 800లకుపైగా ట్రైన్స్‌ను నడుపుతోంది. వీటిలో కేవలం సంక్రాంతికి వెళ్లే వారి కోసమే 150కిపైగా ట్రైన్స్ రన్ చేస్తోంది. ఎన్ని ట్రైన్స్ నడుపుతున్నా ఊరికి వెళ్లే ప్రయాణికులకు మాత్రమే సీట్లు లభించడం లేదు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్లు పెట్టిన క్షణాల్లోనే ఫుల్ అవుతన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బెంగాల్, కర్ణాటక వెళ్లే ట్రైన్స్ కిటకిటలాడుతున్నాయి. ట్రైన్స్ ఏర్పాటు చేయడమే కాకుండా రైల్వేస్టేషన్లఅబశ్రీశ్రీపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి తోడు ఆన్‌లైన్‌లో కూడా సాధారణ టికెట్ తీసుకునే ఫెసిలిటీ తీసుకొచ్చింది రైల్వే శాఖ. వీటిపై రాయితీ కూడా ఇస్తోంది.

**ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్‌లు**

ట్రైన్స్‌లో టికెట్ దొరకని వారు బస్‌లవైపు చూస్తున్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రోడ్ రవాణా సంస్థలు ప్రత్యేక బస్‌లను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే తెలంగాణ ఎక్కువ స్పెషల్ బస్‌లను వేసింది. వాటికి స్పెషల్ ప్రైస్ పెట్టింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీస్‌లు నడుపుతోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి ప్రత్యేక సర్వీస్‌లు ఎక్కువగా లేకపోవడంతో జనాలకు ప్రైవేటు ఆపరేటర్లు దిక్కు అయ్యారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకొని సాధారణ ఛార్జీలే వసూలు చేయాలని ప్రైవేటు ఆపరేటర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా సరే ప్రైవేటు ఆపరేటర్లు మాత్రం ఇష్టం వచ్చిన ధరలకు టికెట్లు అమ్ముతున్నారు. రద్దీకి తగ్గట్టుగా అప్పటికప్పుడు రేట్లు ఫిక్స్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో రేటు తక్కువగా కనిపిస్తున్నా ఖాళీలు లేవన్నట్టు చూపిస్తున్నారు. సరే నేరుగా ఏదైనా బస్ దొరుకుతుందేమో అని చూస్తే అక్కడ కూడా భారీగా టికెట్ రేట్లు పెంచి అమ్ముతున్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రయత్నించి విఫలమైన మరికొందరు లాంగ్ డ్రైవ్ లాంటి యాప్ సహాయాన్ని తీసుకుంటున్నారు. అందులో వారం రోజులకు కార్లను బుక్ చేసుకుంటున్నారు. మరికొందరు షేరింగ్ ఫెసిలిటీ ఉందమో అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇలా ఏదో రకంగా ఊరుకు చేరిపోవాలని పండగను ఆనందంగా జరుపుకోవాలని చూస్తున్నారు.



### ఘనంగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్

## పుట్టినరోజు వేడుకలు

**కూకట్ పల్లి, జనవరి 10 (నమస్తే ఉదయం)**

యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన శుభసందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ కార్యాలయంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో కలిసి కేక్ కట్ చేసి యువనేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో ఉన్న జగద్గురు శ్రీ రవిదాస్ మహారాజ్ మందిరంలో సమగర మోచి సంగం సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని సాయి నగర్ వెస్ట్ లోని శ్రీ రాజేశ్వరి ఓల్డేజ్ హోం లో కాలనీ వాసుల ఆధ్వర్యంలో వృద్దులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన ప్రతిఒక్కరికి పేరుపేరునా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 10(నమస్తే ఉదయం)**



ఇంటినుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కేటిదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఉమిత్యాల తండాకు చెందిన చంద్రమ్మ కూతురు ఈరమ్మ(19) ఈ నెల 8న ఉదయం 9.30గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అనంతరం ఆమె ఎంతకూ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువుల, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం కేటిదొడ్డి పోలీస్ స్టేషన్‌లో యువతి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670292 నంబర్ కు సమాచారం అందించాలని కోరారు.

## తెలంగాణ బరిలో జనసేన

**మొదటి పేజీ తరువాయి...**

జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పింది. ఎన్నికలకు తక్కువ సమయం ఉండడంతో ప్రతి జనసైనికుడు, వీరమహిళ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. త్వరలో ఎన్నికల పార్టీ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపింది. తెలంగాణ జనసేన యువజన విభాగం అడ్ హక్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించింది. రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను బలంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ట్రైనింగ్ ఇచ్చారు. అలాగే, సభ్యులకు జనసేన పార్టీ కిట్‌ను అందించారు.ద

## మాజీ ఐపీఎస్ భార్యకు కుచ్చుటోపీ

### రూ.2.58 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

### వాట్సప్ చిట్కాల పేరుతో ఘరానా మోసం

**(హైదరాబాద్ జనవరి 10(నమస్తే ఉదయం)**

సైబర్ కేటుగాళ్ల బారిన పడ్డ ఓ మాజీ ఐపీఎస్ అధికారి భార్య ఏకంగా రూ.2.58కోట్ల మేర నష్టపోయారు. తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి తెరలేపారు. ట్రేడింగ్‌లో చిట్కాల చెబుతామని మొదట వాట్సాప్ మెసేజ్ పంపించారు. తమ చిట్కాలు పాటిస్తే ట్రేడింగ్‌లో 500 శాతం లాభాలు వస్తాయని అన్నారు. సెబీ సర్టిఫైడ్ డాక్యుమెంట్స్ అంటూ కొన్ని నకిలీ కాపీలను కూడా చూపించారు. ఈ విషయాలపై అవగాహన లేకపోవడంతో ఆమె తన భర్త మొబైల్ నెంబర్‌ను వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితురాలు భారీగా పెట్టుబడులు పెట్టారు. 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్ల మేర బదిలీ చేశారు. ఆ తరువాత పెట్టుబడులను నిలిపివేయడంతో నిందితులు బెదిరింపులకు దిగారు. ఇన్వెస్ట్‌మెంట్స్‌ను నిలిపివేస్తే అప్పటివరకూ పెట్టిన పెట్టుబడి పోతుందని బెదిరించారు. ఈ క్రమంలో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు చివరకు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

# ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలు

**మొదటి పేజీ తరువాయి...**



వాళ్లకు ఉన్నాయ్. టీడీపీలో అయితే పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌లో నడుస్తోందట. ఈ ఏడాది మే–జూన్ మధ్య జరిగే రాజ్యసభ సభ్యుల ఎన్నికలపై అప్పుడే లాబీయింగ్ జోరందుకుందట. ఖాళీ అయ్యే నాలుగు సీట్లను టీడీపీ, కూటమి పార్టీలే గెలుచుకునే అవకాశం ఉంది. రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీ కాలం 2026 జూన్ 21తో పూర్తి కానుంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన సానా సతీష్ పదవీకాలం కూడా జూన్‌లోనే ముగుస్తుంది. వీళ్ల స్థానంలో నలుగురు నేతలు ఏపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కానున్నారు.

**జనసేన నుంచి ఎవరో..?**

అయితే మూడు పార్టీలు..నాలుగు సీట్లను ఎలా పంచుకుంటాయనేదే ఆసక్తికరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రాజ్యసభకు ఉప ఎన్నికలు జరిగాయి. తొలుత మూడు స్థానాలకు, ఆ తర్వాత ఒక స్థానానికి ఎన్నిక జరిగితే టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు తీసుకున్నాయి. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనకు ఇప్పటివరకు రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితుల్లో త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ ఎన్నికల్లో జనసేనకు ఓ సీటు కేటాయిస్తారని అంటున్నారు. జనసేనకు కేటాయించే రాజ్యసభ సీటులో లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి పేరు కూడా పరిశీలనలో ఉందని..తన అన్నయ్యను పెద్దలకు సభకు పంపితే ఎలా ఉంటుందనేదానిపై పార్టీ ముఖ్యనేతలతో పవన్ చర్చలు జరుపుతున్నట్లు ఇన్‌సైడ్ టాక్.

**టీడీపీకి ఒక్కసీటు కూడా లేదా**

నాలుగింట్లో ఒకటి జనసేనకు పోతే మిగిలేది మూడు సీట్లు. త్వరలో రిటైర్ అయ్యే నలుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరైన రిలయన్స్ సంస్థలకు చెందిన పరిమళ్ నత్వానీని మళ్లీ రాజ్యసభకు పంపాలని బీజేపీ ఆలోచనగా చెబుతున్నారు. సేమ్‌టైమ్ బీజేపీ ఇంకో సీటును కూడా కోరే అవకాశం ఉందన్న గుసగుసలు మొదలయ్యాయి. అదే గనుక జరిగితే..బీజేపీకి రెండు సీట్లు ఇస్తే టీడీపీకి దక్కేది ఒక్కటే సీటు. ఆ సీటులో కూడా గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ తరఫున ఎన్నికైన సానా సతీష్‌కే మళ్లీ రెన్యూవల్ చేస్తారని టాక్ వినిపిస్తోంది. దీంతో టీడీపీకి కొత్తగా ఒక్క రాజ్యసభ సీటు కూడా వచ్చే అవకాశం లేదన్న చర్చ జరుగుతోంది. టీడీపీలో చాలా మంది సీనియర్లు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన లీడర్లు రాజ్యసభ రేసులో వెయిటింగ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయిన గల్లా జయదేవ్, పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ, జవహర్‌తో పాటు సీనియర్ నేత వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్‌రావు, టీడీ జనార్ధన్, రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి..రాజ్యసభ బెర్తును ఆశిస్తున్న వారిలో ఉన్నారు. పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్న నేతలంతా టీడీపీకి, చంద్రబాబుకు సన్నిహితులు. పార్టీకి ఏదో విధంగా ఉపయోగపడిన వారే. కమ్మ, ఎస్సీ, బీసీ, రెడ్డి వర్గాల నుంచి ఆరేడుమంది రాజ్యసభ సీటు ఆశిస్తుండగా..తమకు దక్కే సీట్లపైనే టీడీపీ అధిష్టానం డైలమాలో ఉందట. ఎలాగైనా రెండు సీట్లు తీసుకుని ఒకటి సానా సతీష్‌కు రెన్యూవల్ చేయడంతో పాటు మరొక సీటు ఆశావహుల్లో ఎవరికో ఒకరికి ఇచ్చి మిగతా వారిని మండలి రేసులో పెట్టే ప్లాన్ చేస్తున్నారట చంద్రబాబు.

# కవి, గాయకులు, రచయిత మన్నె మహాత్మారావు రచించిన మన్నె శ్రీ భజన కీర్తనల పుస్తకం ఆవిష్కరణ నేడు

**బుద్వేల్, జనవరి 10 (నమస్తే ఉదయం)**

కృషి, పట్టుదల మనిషిని మహోన్నతునిగా మారుస్తుంది. అలాంటి కోవకు చెందిన వారే రాజేంద్రనగర్ కు చెందిన మన్నె మహాత్మా రావు. ఆయన పట్టుదల, అకుంఠిత దీక్ష ఆయనను కవిగా, రచయిత గా, గాయకునిగా మార్చింది. ఇప్పటి వరకు 13 ఆధ్యాత్మిక పుస్తకాలను రచించి ప్రజలకు అం దుబాటులోకి తీసుకువచ్చిన ఆయన తాను చిన్న నాటి నుంచి రాసిన 2000ల భజన, ఆధ్యాత్మిక, తత్వ గీతాలలోంచి ప్రజాధరణ పొందిన 108 పాటలను మన్నె శ్రీ భజన కీర్తనల పేరుతో రచించి ఈ నెల 11న విడుదల చేయనున్నారు.



కవి, గాయకులు, రచయిత మన్నె మహాత్మా రావు

**చిన్న నాటి నుంచే ఆధ్యాత్మిక భావన ఎక్కువ :**

కిస్మత్ పూర్ ప్రాంతానికి చెందిన మన్నె మల్లయ్య, సక్కుభాయి ల కుమారుడు ప్రస్తుతం రాజేం ద్రనగర్ లో నివాసం ఉంటున్న మన్నె మహాత్మారావు కు చిన్న నాటి నుంచే ఆధ్యాత్మిక భావన ఎక్కువ. తండ్రి మన్నె మల్లయ్య డైరీఫామ్ లో సూపర్వైజర్ గా పనిచేయడం, తల్లి సక్కుబాయి అక్కడే ఓ చిన్న హోటల్ ను నిర్వహిస్తుండటంతో మహాత్మారావు వారి తో పాటు తరచు డైరీఫామ్ వచ్చేవాడు. హోటల్ వద్ద కూర్చుని భక్తి పాటలు పాడుతుండే అతన్ని డైరీఫామ్ లో మిల్క్ ఆఫీసర్ గా పనిచేస్తే డాక్టర్ విశ్వనాథం ప్రోత్సహించి సమీపంలో ఉండే ఆంజనేయ స్వామీ దేవాలయంలో భజనలకు తీసుకువెళ్లేవారు. అక్కడ ఎనిమిది సంవత్సరాల వయస్సున్న మన్నె మహాత్మారావు పాటలకు చక్కగా కోరస్ ఇవ్వడం చూసిన డాక్టర్ విశ్వనాథం ఆయన తం డ్రి మల్లయ్య ను పిలిచి మీ బాబుకు మంచి ఆధ్యాత్మిక చింతన ఉంది ప్రోత్సహిస్తే గొప్ప ప్రయోజకుడవుతాడని చెప్పాడంట. అప్పటి నుంచి మహాత్మారావు కు దేవుని పాటలన్నా, దైవ భక్తి అన్నా మరి ఎక్కువైంది.

**గోషామహల్ పాఠశాలలో పండిట్ నారాయణరావు ప్రోత్సాహంతో....**

గోషామహల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న తనను 9వ తరగతి లో తెలుగు పం డిట్ గా ఉన్న పండిట్ నారాయణ రావు ప్రోత్సహించి కవితలు, పాటలు రాయడం పట్ల శిక్షణ ఇచ్చాడని మహాత్మారావు తెలిపారు. 1967లోనే తాను రాసిన కనరావా... దేవ దేవా... కరుణాల వాల బ్రోవ అనే పాట ఎంతో ఆదరణ పొందిందన్నారు. అక్కడి నుంచి తాను రాసిన అనేక ఆధ్యాత్మిక, జానపద గేయాలు ఎంతో పేరు తెచ్చాయన్నారు. తాను రాసిన నిమ్మల బాయి గట్టు మీద, నెమలి చెట్ల నీడ క్రింద అనే పాట రేడియో లో కూడా ప్రసారం అయ్యిందన్నారు. దోరనిమ్మ పండువన్నె చిన్నది... లంబాడి తండలొక్కటున్నది.... అనే జానపద గేయం ఎంతో ప్రసిద్ది చెందిందన్నారు. జానపద గేయాలు, భక్తి పాటలు ఇలా ఇప్పటి వరకు 2000 పాటలు రాశానన్నారు.



ఆవిష్కరణ కు సిద్ధంగా ఉన్న రచయిత మన్నె మహాత్మా రావు రచించిన మన్నె శ్రీ భజన కీర్తనలు పుస్తకం

**ఇంద్రన్న కు బాసటగా....**

మన్నె మహాత్మారావు ఆధ్యాత్మిక , జానపద గేయాలతో పాటు రాజకీయ నాయకులకు కూడా పాటలు పాడి వారికి చేదోడుగా నిలిచారు. రంగారెడ్డి జిల్లాలో ప్రముఖ నాయకునిగా పనిచేసిన దివంగత పి ఇంద్రారెడ్డికి డిజిటల్ మీడియా లేని సమయంలో ఆయన సొంతగా పాటలు రాసి పాడేవారు. రెండు పయ్యల సైకి లెక్కి హ్యాండిల్ చేతబట్టి... ఓట్లడుగా వస్తున్నాడమ్మో ...మా ఇంద్రారెడ్డి ... ఓట్లేసి గెలిపించండమ్మో మా అమ్మ లారా... అంటూ, రంగారెడ్డి జిల్లాలో ఇంద్రారెడ్డి చేసిన పనులు తెలిపేదము వినండి... అంటు ఆయన పాడిన పాటలు ఎంతో ఊపు నిచ్చేవిగా ఉండేవని ఆయన శిష్యులు గుర్తుచేసుకున్నారు.


అదనపు డీసీపీగా పదోన్నతి పొందిన కుశాల్కర్ ను సన్మానిస్తున్న శివరాంపల్లి నాయకులు

# అదనపు డీసీపీ కుశాల్కర్‌కు శుభాకాంక్షలు

**రాజేంద్రనగర్ , జనవరి 10(నమస్తే ఉదయం)**

మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ గా విధులు నిర్వహించిన కుశాల్కర్ కు అదనపు డీసీపీ గా పదోన్నతి లభించింది. సిద్దిపేట అదనపు డిసిపి గా పదవి బాధ్యతలు స్వీకరించిన కుశాల్కర్ ను రాజేంద్రనగర్ డివిజన్ కు చెందిన శివరాంపల్లికి చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కుశాల్కర్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్ పెక్టర్ గా విధులు నిర్వహించారు. కుశాల్కర్ ను కలిసిన వారిలో గుమ్మడి శ్రీధర్ రెడ్డి, పొడవు జయప్రకాష్, మాదూరి ప్రభాకర్ రెడ్డి , పన్నాల సూర్యప్రకాష్ రెడ్డి లు ఉన్నారు.

# రాజేంద్రనగర్ ప్రాంతాలను హైదరాబాద్‌లో కలిపితే ప్రజా ఉద్యమమే




అఖిల పక్ష పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి

## బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, జనవరి 10 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని డివిజన్లను సైబరాబాద్ కమిషనరేట్ లోనే ఉంచాలని అన్ని వర్గాలను కలుపుకుని ప్రజా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి . కార్తీక్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా లోని ఐబీ ఫంక్షన్ హాల్ లో శనివారం బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ముందుగా లీకులు ఇచ్చిన ప్రకారం 300 డివిజన్లతో పెద్ద కార్పొరేషన్ ను ఏర్పాటు చేస్తే బాగుంటుందని, లేని పక్షంలో 100 డివిజన్ల చొప్పున మూడు కార్పోరేషన్లను చేయాలన్నారు. రాజేంద్రనగర్, ఎల్బీ నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి నియోజకవర్గాలను కలసి సైబరాబాద్ కార్పోరేషన్ ను చేయాలన్నారు. రాష్ట్రానికి డబ్బులు సంపాదించి పెట్టే రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. సైబర్ కారిడార్ గా పిలుచుకునే శంషాబాద్, రాజేం ద్రనగర్ ప్రాంతాలను మూడు ముక్కలు చేసి రంగారెడ్డి జిల్లాను విచ్ఛిన్నం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ను విమర్శించాలని లేదని, అయితే నాలుగు సార్లు ఎమ్మెల్యే గా అయిన ప్రకాశ్ గౌడ్ ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడమే తమ బాధ అన్నారు. బీఆర్ఎస్ లో గెలిచిన ఆయన ముఖ్యమంత్రి తో కలిస్తే ఆయన కు దగ్గరగా ఉండి సమస్యలు చెప్పవచ్చని కాంగ్రెస్ లోకి వెళ్లారని, రాజేంద్రనగర్ నియోజకవర్గం అస్థిత్వాన్ని కోల్పోతుంటే కూడా ప్రశ్నించకపోవడంతో నియోజకవర్గం హైదరాబాద్ లో కలిస్తే ప్రధమ మ ద్దాయి అయనే అవుతారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కుక్కలు చింపిన విస్తరిగా అవుతు ంటే అసెంబ్లీలో ఉండి మాట్లాడాల్సిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ దుబాయ్ కు వెళ్లారని, అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. పాలకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే నియోజకవర్గం మూడు ముక్కలుగా ఎలా విభజిస్తారని ప్రశ్నించారు. బండ్లగూడ ప్రాంతంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు అఖిల పక్ష పార్టీల సమావేశాలకు వస్తుంటే రాజేంద్రనగర్ సర్కిల్ లో ఆ పార్టీల వారు కలసి రాకపోవడం బాధాకరమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని డివిజన్లను, పోలీస్ డివిజన్లను సైబరాబాద్ లోనే ఉం చాలని ఎమ్మెల్యే, ఎంపీలకు అఖిలపక్ష పార్టీల తరపున లేఖలను అందజేయాలన్నారు. అప్పటికి వినకపోతే బస్తీలలో ఉన్న యువజన, మహిళా, స్వచ్ఛంధ సంస్థలు, భజన మండళ్ల సభ్యులను ఏకం చేసి ప్రజా ఉద్యమాన్ని చేపట్టడానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో పుస్తకాల నర్సింగ్రావు, కన్యగారి నర్సింహ్మారెడ్డి, ఎం ఎ రియాజ్ (సీపీఐ), కొలన్ సుభాష్ రెడ్డి , ఎస్ వెంకటేశ్, వనం శ్రీరాంరెడ్డి, గుమ్మడి కుమార్, ఎడ్లకాడి సూర్యం, అక్కెం రాఘవేందర్ యాదవ్, నోముల రాము యాదవ్, జాలిగం చిత్తారి. వీర్లపల్లి నవీన్ కుమార్, పి.జీవన్ దాస్, రావుల జంగయ్య, కోరని మహాత్మా(బీఆర్ఎస్), గుంటి రాజ్ కుమార్, మాగని శివ (బీజేపీ), ఎం ఎం నయీమ్, గోల్కొండ రాజ్ కుమార్ (కాంగ్రెస్) తో పాటు డి రమేశ్ ముదిరాజ్, సరికొండ దుర్గేశ్, చిరంజీవి, పి.సాయిగౌడ్, బంగి శ్రీను, మైసిరెడ్డి, రాజేశ్ యాదవ్, నరేశ్ యాదవ్, సత్యం, హర్షద్, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# వాహనదారులు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి: సీఐ ఆంజనేయులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( కీసర ) జనవరి 10 ( నమస్తే ఉదయం ):-**

వాహనదారులు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని కీసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కీసర పోలీస్ స్టేషన్ సీఐ ఏ అంజనేయులు ఆధ్వర్యంలో శ్రద్ధ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి కీసర ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కీసర క్రాస్ రోడ్డు వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ ఆంజనేయులు మాట్లాడుతూ...వాహనదారులు రోడ్డు భద్రత తో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనం వెళ్లే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ను ధరించి వాహనాన్ని నడపాలని అన్నారు. వాహనాన్ని నడిపేవారు డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలి, రోడ్డు నిబంధనలను విరుద్ధంగా స్పీడుతో వాహనాలను నడపరాదని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపిన చో చట్టపరమైన చర్యలు తప్పవని వాహనదారులకు ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు బి నాగరాజు, హరి ప్రసాద్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లను సైబరాబాద్‌లోనే ఉంచాలి

## బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్

**బుద్వేల్, జనవరి 10 (నమస్తే ఉదయం)**

గ్రేటర్ హైదరాబాద్ పునర్వ్యస్థీకరణలో భాగం గా శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లను హైదరాబాద్ పరిధిలో కాకుండ సైబరాబాద్ లో విలీనం చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. ఉప్పర్ పల్లి లోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని సగం ప్రాంతాలు ఇప్పటికే సైబరాబాద్ కార్పోరేషన్ లో ఉన్నాయని, మిగిలిన ప్రాంతాలైన శంషాబాద్, రాజేం ద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లు హైదరాబాద్ కార్పోరేషన్ లో ఉండటం వల్ల ప్రజలకు అనేక పరి పాలన పరమైన ఇబ్బందులు వస్తాయన్నారు. పోలీసింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అనుమతులు, భద్రత వంటి అనేక అంశాల్లో స్పష్టత లేకుండ పోయిందన్నారు. శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాలు సైబరాబాద్ పరిధిలోకి వస్తే ఈ ప్రాంతాలలో మెరుగైన భద్రత, వేగవంతమైన సేవలు, అభివృద్ధి జరుగుతుందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉ ంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ గోల్కొండ గోషామహల్ ఇంచార్జి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి మల్లేశ్ యాదవ్, కో కన్వీనర్ బి మహలింగం గౌడ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య, జోగు రవి, నందకిషోర్, సందీప్ ముదిరాజ్. తదితరులు పాల్గొన్నారు.


సంక్రాంతి సంబరాలలో
రాజేంద్రనగర్ ఆదర్శ విద్యాలయ హై స్కూల్ చిన్నారులు

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన వస్త్రాలతో చిన్నారులు

**బుద్వేల్, జనవరి 10 (నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ ఆదర్శ విద్యాలయ హై స్కూల్ లో శనివారం సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులు సంతోషంగా సంక్రాంతి పండుగ లో పాల్గొన్నారు. గంగిరెద్దులు, పిండి వంటలతో పండుగ విశిష్ఠతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యాలయ హై స్కూల్ ప్రిన్సిపాల్ గిరిజాదేవి, వైస్ ప్రిన్సిపాల్ అప్సర్ షాహీన్, ఉపాధ్యాయి నీలు హేమలత, శ్రీదేవి, ఆస్మా, పద్మ, ప్రియాంక, నజీయాలు పాల్గొన్నారు .

# పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలు






**గద్వాల జిల్లా ప్రతినిధి,జనవరి10(నమస్తే ఉదయం)**

గద్వాలలోని శ్రీవిశ్వేశ్వరయ్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాకమిటి చైర్మన్ పి. సాయిబాబ,, గద్వాల న్యూగంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.మహేశ్వర్ రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి సంక్రాంతి సంబురాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి సాంప్రదాయ దుస్తులలో వచ్చి ముగ్గుల పోటీలలో పాల్గొని పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారని అన్నారు.ప్రతి రంగవల్లి కూడా సంక్రాంతి సంబురాల సందేశాన్ని తెలిపేటట్టుగా తమ కళానైపుణ్యాలను తెలపుతూ విద్యార్థినులు ముగ్గులు వేయడం జరిగింది. ఈ కార్యక్రమములో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ బాణాల వృషాలి, పచ్చిపులుసు శ్రీదేవి, పచ్చిపులుసు వైష్ణవి ప్రతి ముగ్గులను క్షుణ్ణంగా పరిశీలించి మొదటి, రెండవ, మూడవ మరియు కన్సలేషన్ ప్రైజ్ విజేతలను ప్రకటించారు. ఈ రంగవల్లుల గురించి విద్యార్థినులకు తమ సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం రంగవల్లులలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటి చైర్మన్ పి. సాయిబాబ, గద్వాల న్యూగంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. మహేశ్వర్ రెడ్డి, గంజ్ కమిటి సభ్యులు, వైస్ చైర్మన్ బి. జయప్రకాష్, ప్రధానకార్యదర్శి జి. విజన్మోహన్, కోశాధికారి కె. తారనాథ్, డైరెక్టర్స్ వి. నర్సింహులు, కె. రాముడు, యన్.భాస్కర్, యన్. రామాంజనేయులు మరియు పాఠశాల ప్రిన్సిపాల్ భారతిఅబశ్రీశ్రీ ఫడ్నిష్, ప్రధానోపాధ్యాయులు ఈ. కిషోర్ కుమార్ గౌడ్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపిస్తా

## కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) జనవరి 10 (నమస్తే ఉదయం ):**

అల్వాల్ డివిజన్ లో ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. శనివారం అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి తన కార్యాలయంలో ఛాయాపే చర్చ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలము ఆశా వర్కర్లతో తేనేటి విందు ఏర్పాటుచేసి వారి కి ఉన్న సమస్యలపై చర్చించారు. ఆశ వర్కర్లు పలు సమస్యలపై కార్పొరేటర్ కు విన్నవించారు .ముఖ్యంగా సెంటర్స్ కూడా లేని ప్రదేశాలు ఉన్నాయని కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ కు విన్నవించారు. సరైన వసతులు లేవని, మూత్ర శాలలు కూడా లేవని వెల్లడించారు. బుధవారం శనివారం గర్భిణులకు కానీ పిల్లలకు గాని వ్యాక్సిన్స్ వేయడానికి సరైన వసతులు లేవని ఆమెకు తెలిపారు. ఆశ వర్కర్ల సమస్యలపై స్పందించిన కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కావలసిన సదుపాయాల కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పై అధికారుల కు విన్నవించే ప్రయత్నం చేస్తానని, ఆమె వర్కర్లకు హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు జ్యోతి, కోమలత ,చంద్రిక, భాగ్య, ప్రమీల, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


అల్వాల్‌లో చాయ్ పే చర్చలో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి

### తెలంగాణ రాష్ట్ర జనసేన అధ్యక్షుడు

# నేమూరి శంకర్ గౌడ్ కీలక నిర్ణయం

## రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో జనసేన పార్టీ పోటీకి సిద్ధం

## రాష్ట్ర కీలక నేతలు, కార్యకర్తలతో దేశానిర్దేశం

**కూకట్ పల్లి, జనవరి 10 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర జనసేన అధ్యక్షుడు నేమూరి శంకర్ గౌడ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల తో పాటు జిహెచ్ఎంసి ఎన్నికల్లో కూడా జనసేన పార్టీ పోటీకి సిద్ధంగా ఉందని ఈ మేరకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం కూకట్ పల్లి నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర కీలక నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దేశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే అడక్ కమిటీలను ఏర్పాటు చేశామని రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీలో చేరే నేతలను కీలక నాయకులను ఏ విధంగా చేర్చుకోవాలని అంశం పైన ఈ కమిటీ నేతలు చర్చించి వారిని పార్టీలోకి తీసుకొని వస్తారని అన్నారు. పోటీ చేసే విషయంలో టిడిపి, జనసేన, బిజెపి పార్టీ లు కలిసి పోటీ చేసే అంశాన్ని పైన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రశ్నించే విధంగా పార్టీని తయారు చేస్తున్నామని అన్నారు.




# కోటిన్నర రూపాయలు మోసం చేసిన ఫాస్టర్

## నమ్మించి నట్టేట ముంచిన పాస్టర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 10(నమస్తే ఉదయం)**

గద్వాల జిల్లాలో ఓ ఫాస్టర్ ఘరాన మోసం బయటపడింది. క్రైస్తవ వర్గం వారిని టార్గెట్ చేసి బురిడీ కొట్టించి సుమారు కోటిన్నర రూపాయల దాకా వసూలు చేసి టోకరా పెట్టినట్లు బాధితులు ఆరోపించారు. గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో గల ఓ ప్రార్ధన మందిరం ఫాస్టర్ గా పని చేస్తున్న వసంత్ అనే వ్యక్తి మీరు డబ్బులు ఇస్తే రెట్టింపు అవుతాయని నమ్మబలికి నట్టేట ముంచారు. తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు సదరు ఫాస్టర్ ను మా డబ్బులు మాకివ్వాలని గత కొద్ది నెలలుగా అడుగుతుండగా కాలయాపన చేస్తుండడంతో ఇటీవల బాధితులు గద్వాల పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల మండలం గోనుపాడు, ధరూర్ మండలం మార్లబీడులో గల చర్చిలో ఫాస్టర్ గా పని చేస్తున్న వసంత్ ప్రార్థనకు వస్తున్న ప్రజలను నమ్మించి ఒక వ్యక్తి ఒకసారి డబ్బులు కడితే డబ్బులు రెట్టింపు వస్తాయని చెప్పడంతో బాధితులు అత్యాసతో డబ్బులు చెల్లించారు. డబ్బులు కట్టిన వారికి వాహనాలు కూడా ఇస్తామని నమ్మబలికాడు. ఇలా ధరూర్, గద్వాల, గట్టు మండలాలకు చెందిన ప్రజలు ఫాస్టర్ మాయ మాటలు నమ్మి ఒకొక్కరు రూ.20,000 నుంచి రూ.2లక్షలు చెల్లించారు. తీరా చూస్తే తాము మోసపోయామని గ్రహించి డబ్బులు తిరిగి చెల్లించాలని ఫాస్టర్ ను నిలదీయడంతో గద్వాల నుంచి పరారయ్యాడు. కొంతకాలానికి గద్వాలకు ఫాస్టర్ రావడంతో తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని కోరగా ఎలాంటి స్పందన లేకపోవడంతో గద్వాల రూరల్ పోలీస్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేయడం జరిగింది.






## పటాన్ చెరు ఎమ్మెల్యేను కలిసిన

# నూతన తాసిల్దార్ హరిబాబు

**పటాన్ చెరు, జనవరి 10 (నమస్తే ఉదయం):**

పటాన్ చెరు మండల తహసిల్దారుగా ఇటీవల బదిలీపై వచ్చిన హరిబాబు శనివారం పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే జిఎంఆర్ తహసిల్దార్ కు సూచించారు.



# కొత్తకోటకు మంజూరైన ఇండోర్ స్టేడియం

## స్థలాన్ని పరిశీలించిన అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు.

**కొత్తకోట, జనవరి 10 (నమస్తే ఉదయం):**

కొత్తకోట పట్టణ కేంద్రానికి ఇండోర్ స్టేడియం మంజూర అయింది. దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ఆదేశాల మేరకు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలాన్ని అధికారులు, పార్టీ నాయకులు పరిశీలించారు.శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్తకోట మున్సిపల్ పరిధిలో, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంతోపాటు క్రీడాకారులకు మెరుగైన వసతులతో కూడిన స్టేడియం అందించాలన్న సమున్నత లక్ష్యంతో, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని,యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించేందుకు, ఈ స్టేడియం యువతకు ఒక ఆరోగ్యకరమైన వేదిక మాత్రమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహద పడుతుందనే లక్ష్యంతో,దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కొత్తకోట పట్టణానికి ఇండోర్ స్టేడియంను మంజూరు చేయించడంతో, అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థలాన్ని పరిశీలించారు.



## మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకల్లో

# పాల్గొన్న బొల్లారం నాయకులు

**పటాన్ చెరు, జనవరి 10 (నమస్తే ఉదయం):**

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్న నేపథ్యంలో నగరంలోని ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో బొల్లారం డివిజన్ కాంగ్రెస్ యువజన నాయకులు వి.ప్రవీణ్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ నాయకులతో కలిసి మైనంపల్లి హనుమంతరావు ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కృష్ణంరాజు గారు, చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సింహారాజు, రమేష్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు భాస్కర్, ధన్రాజ్, యువజన నాయకులు మహేందర్ రెడ్డి, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఊరికి వెళ్ళే వారికి పోలీసుల సూచన

## బొల్లారం ప్రజలనుద్దేశించి పత్రికా ప్రకటన విడుదల

**పటాన్ చెరు,జనవరి 10 (నమస్తే ఉదయం):**

సంక్రాతి పండుగ, వరుస సెలవుల కారణంగా ఊరు విడిచి వెళ్లాలనుకునే వారికి బొల్లారం పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. బొల్లారం విడిచి ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇండ్లలో ఉ ండే బంగారం, నగదు ఇతర విలువైన వస్తువుల ను భద్రపరచుకోవాలని, సరైన తాళాలు వాడాలని సూచిఅబశ్రీశ్రీస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.




అదేవిధంగా ఆటోలో ప్రచారం నిర్వహించారు. దొంగతనాలు నివారించుటకు ఫ్లెక్సీ ద్వారా అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల గోడ పత్రికలు అతికించి, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించినట్లు బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733